దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం! గమనం!!

సంపుటి: 3 | సంచిక : 246 | ఆదివారం 13. 9. 2026 | ఎడిటర్ వేముల అయోధ్య రాములు | పేజీలు 4 | వెల: 5.00


## తెలంగాణకు భారీ నుంచి అతిభారీ వర్షాలు.

రాష్ట్రంలో ఆది, సోమవారాల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని ఆదిలాబాద్, కుమరంభీం అసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలలో అక్కడక్కడా అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆయా జిల్లాలలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. దక్షిణ ఒడిశా తీరం వెంబడి ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ అల్పపీడనం తొలుత అంచనా వేసిన మార్గం కంటే భిన్నంగా ఉత్తర దిశగా ప్రయాణిస్తూ, విదర్భ ప్రాంతానికి చేరుకుని బలహీనపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో రెండురోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నేడు, రేపు భారీ వర్షాలు, ఉరుములు, 30 నుండి 40 సెం.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పలుజిల్లాల్లో కురుస్తాయని పేర్కొంటూ ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.



# మహానగరంలో గణేశ్ ఉత్సవాలను నిరంతరం పర్యవేక్షించాలి

## తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

- గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశం
- నిమజ్జన కార్యక్రమాలు సాఫీగా సాగేందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలి
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేకంగా ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలి
- గణేశ్ ఉత్సవాలకు సంబంధించి గత సంప్రదాయాన్ని పునరుద్ధరించాం
- వసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలి
- అనుకోని పరిణామాలు జరిగినప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి

**తొలి సమయం హైదరాబాద్**

హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ చేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గణేశ్ ఉత్సవాలు పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలని చెప్పారు. శాసనసభ ఆవరణలోని మండలి సమావేశ మందిరంలో హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , మహమ్మద్ అజారుద్దీన్ , ఎంపీ వేం నరేందర్ రెడ్డి , నగర ప్రజా ప్రతినిధులు, జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజిగిరి మున్సి పల్ కార్పొరేషన్ (ఎంఎంసీ), హైడ్రా కమిషనర్లు, పోలీసు ఉన్నతాధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# బండారం బయటపడుతుందని తప్పించుకొని తిరుగుతున్నారు



- ప్రజల ఆస్తుల పరిరక్షణే రెవెన్యూ సంస్కరణల లక్ష్యం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని గత పాలకులు లక్షలాది ఎకరాలు చెరబట్టారని ఆక్షేపించారు.
- ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా వాళ్ల బండారం బయటపడుతుందని తప్పించుకొని తిరుగుతున్నారు..
- 22ఏ నిషేధిత భూముల అంశంపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా శాసనసభలో పొంగులేటి
- పోరాడి సాధించుకున్న తెలంగాణను గత పాలకులు స్వప్రయోజనాలు
- "పదేళ్లలో కేసీఆర్ కుటుంబం, వాళ్ల బంధువులు మాత్రమే బాగుపడ్డారు.
- రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ శాఖను కేసీఆర్ తనవద్దే ఉంచుకున్నారు.
- భూముల అక్రమాలకు పాల్పడ్డారు. భూములు కొల్లగొట్టేందుకే ధరణిని వాడుకున్నారు.
- రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాలను తమ సొంత ఆస్తిలా గత పాలకులు భావించారు.
- దివాళా తీసిన విదేశీ సంస్థకు ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారు.
- ధరణి పోర్టల్‌ను గుప్పిట్లో పెట్టుకొని అర్ధరాత్రి వేళ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.
- పోర్టల్‌లో దొర్లిన తప్పులకు లక్షలాది మంది రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగారు.
- వందల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు'

## రేవంత్‌రెడ్డి బ్లాక్ మెయిలర్ల సంఘం అధ్యక్షుడు: కవిత

**తొలి సమయం హైదరాబాద్**



సీఎం రేవంత్‌రెడ్డి అవినీతి సామ్రాట్.. బ్లాక్ మెయిలర్ల సంఘం అధ్యక్షుడని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆర్టీఐ చట్టాన్ని దుర్వినియోగం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించిన చరిత్రను ప్రజలు మర్చిపోరని శనివారం ఆమె వీడియో సందేశాన్ని రిలీజ్ చేశారు. సీఎం కుటుంబ సభ్యులు, మిత్రమండలి, అవినీతిలో రాటుదేలిన మంత్రులతో కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. అలాంటి వ్యక్తి అసెంబ్లీలో తనకు కమీషన్లు ఎందుకంటూ కమల్ హాసన్ లెవల్‌లో ఏకపాత్రాభినయం చేస్తుంటే రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. గుంపు మేస్త్రీ –గుంటనక్క కుమ్మక్కయారని కవిత ఆరోపించారు. సిద్దిపేటలో నిషేధిత జాబితాలో ఉన్న వంద ఎకరాల భూమిని హరీశ్‌రావు తన తండ్రి, కుటుంబ సభ్యుల పేరు మీదకు బదలాయించారని.. దానిపై చర్యలు తీసుకునే దమ్ము ఈ ముఖ్యమంత్రికి ఉందా అని సవాల్ విసిరారు. అటు ప్రజా సమస్యలను చర్చించాల్సిన అసెంబ్లీని అధికార, ప్రతిపక్షాల గొడవలకు వేదిక చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ అధికారంలోకి రాకముందు ఆర్టీఐ చట్టాన్ని ఉపయోగించుకొని రియల్టర్లను బెదిరిస్తే.. ఇప్పుడు అధికారంలో ఉండి కుటుంబసభ్యులు, మంత్రి మండలి మిత్రులతో కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారన్నారు.

## హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం


- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లును తెలంగాణ శాసనసభలో చర్చ
- హైదరాబాద్‌లో రవాణా కోసం కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ చేశాం
- హైదరాబాద్ విస్తరణ పెద్దఎత్తున జరుగుతోంది
- రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా మరింత సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం
- "మూసీ పునరుజ్జీవం తొలిదశకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు ఇచ్చాం.
- 20 టీఎంసీల గోదావరి జలాలు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాం.
- జీహెచ్ఎంసీని ట్రై కార్పొరేషన్లుగా విభజించుకున్నాం.



# 'బ్రిక్స్' ఎవరికీ వ్యతిరేకం కాదు: మోదీ

- ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోన్న సంఘర్షణలకు బ్రిక్స్ దేశాలు పరిష్కారం చూపించాలి
- భారతదేశ ప్రధాని నరేంద్రమోడీ పిలుపు
- గ్లోబల్ సౌత్ దేశాలు ఇక నుంచి నిబంధనలు పాటించేవిగానే ఉండకూడదు
- దిల్లీలోని భారత మండపం వేదికగా జరుగుతోన్న బ్రిక్స్ వార్షిక సదస్సు
- ఏఐ, సైబర్ స్పేస్, బయోటెక్నాలజీ రంగాల్లో సభ్యదేశాలు పరస్పరం సహకరించుకోవాలి
- అంతర్జాతీయ స్థాయిలో బ్రిక్స్ ప్రత్యేక గుర్తింపు పొందింది
- ఐరోపా దేశాలను మేం బెదిరించట్లేదు: పుతిన్
- ప్రజలకు మనం భరోసా కల్పించాలి. కష్టాల్లో ఉన్నప్పుడు ఉమ్మడి బాధ్యత తీసుకుందాం.
- ప్రస్తుతం ప్రపంచ పాలనా నిర్మాణం ఓ పిరమిడ్‌లా కనిపిస్తోంది.
- అధికారం, నిర్ణయాలు తీసుకోవడం అనేది శిఖర భాగంలో కేంద్రీకృతమై ఉండగా..
- దిగువన ఉన్న దేశాలు ఆ నిర్ణయాల వల్ల ప్రభావితం అవుతున్నాయి.
- ఆ నిర్ణయాలను రూపొందించడంలో వీటి పాత్ర పెద్దగా ఉండటం లేదు.
- ప్రపంచ సంక్షోభాలలో ముందువరుసలో ఉన్న గ్లోబల్ సౌత్..
- నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మాత్రం వెనకబడి ఉంది.

**తొలి సమయం హైదరాబాద్**



ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోన్న సంఘర్షణలకు బ్రిక్స్ దేశాలు పరిష్కారం చూపించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. గ్లోబల్ సౌత్ దేశాలు ఇక నుంచి నిబంధనలు పాటించేవిగానే ఉండకూడదని.. ప్రపంచానికి నియమాలు నిర్దేశించేవిగా ఎదగాలని ఆకాక్షించారు. దిల్లీలోని భారత మండపం వేదికగా జరుగుతోన్న బ్రిక్స్ వార్షిక సదస్సులో ప్రారంభోప న్యాసం చేసిన ఆయన . ఏఐ, సైబర్ స్పేస్, బయోటెక్నాలజీ రంగాల్లో సభ్యదేశాలు పరస్పరం సహకరించు కోవాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో బ్రిక్స్ ప్రత్యేక గుర్తింపు పొందిందని, అయినప్పటికీ ఇది ఏ ఒక్కరికీ వ్యతిరేకం కాదన్నారు. మోదీ చేసిన ఈ వ్యాఖ్యలు అమెరికాతోపాటు పాశ్చాత్య దేశాలకు ఓ సందేశంగా నిపుణులు భావిస్తున్నారు. "బ్రిక్స్ ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు పూర్తయ్యింది. ప్రజలకు మనం భరోసా కల్పించాలి. కష్టాల్లో ఉన్నప్పుడు ఉమ్మడి బాధ్యత తీసుకుందాం. ప్రస్తుతం ప్రపంచ పాలనా నిర్మాణం ఓ పిరమిడ్‌లా కనిపిస్తోంది. అధికారం, నిర్ణయాలు తీసుకోవడం అనేది శిఖర భాగంలో కేంద్రీకృతమై ఉండగా.. దిగువన ఉన్న దేశాలు ఆ నిర్ణయాల వల్ల ప్రభావితం అవుతున్నాయి. ఆ నిర్ణయాలను రూపొందించడంలో వీటి పాత్ర పెద్దగా ఉండటం లేదు. ప్రపంచ సంక్షోభాలలో ముందువరుసలో ఉన్న గ్లోబల్ సౌత్.. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మాత్రం వెనకబడి ఉంది. ఇకపై ప్రతి సభ్య దేశం భాగస్వామిగా మారి.. గళం వినిపించాలి. ఇందుకోసం చేసే ప్రతి ప్రయత్నం మానవాభివృద్ధి కోసమే ఉండాలి. వచ్చే సదస్సు నాటికి కొత్త సంస్కరణలతో సిద్ధం కావాలి. మరోవైపు ఐరాస భద్రతామండలిలో సంస్కరణలు చేపట్టాలి.



## తెలంగాణ భవన్‌లో'మాక్ అసెంబ్లీ..

శాసనసభ సమావేశాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఏకపక్షంగా సస్పెండ్ చేయడాన్ని, అసెంబ్లీ వద్ద మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ నేడు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో భారత్ రాష్ట్ర సమితి వినూత్నంగా 'మాక్ అసెంబ్లీ' నిర్వహిస్తోంది. ప్రజా సమస్యలపై శాసనసభలో గళమెత్తే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపిస్తూ నిర్వహించనున్న ఈ ప్రజా వేదికలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్ రావుతో పాటు సభ నుంచి సస్పెన్షన్‌కు గురైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలను ఎండగట్టేందుకు ఈ వేదికను ప్రధాన అస్త్రంగా మార్చుకోవాలని గులాబీ దళం నిర్ణయించింది. ఈ మాక్ అసెంబ్లీ నిర్వహణ కోసం ప్రత్యేక పాత్రలను కూడా కేటాయించారు. సభా వ్యవహారాలను నడిపించే స్పీకర్‌గా మాణిక్యరావు వ్యవహరించనుండగా, ముఖ్యమంత్రిగా మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యవహరించనున్నారు. .

## సుద్దాల అశోక్ తేజకు 'తెలంగాణ తెలుగు తేజం' పురస్కారం

తెలుగు భాషా సంరక్షణ సంఘం–తెలంగాణ సాహితీ సంస్థ ఏటా ప్రదానం చేస్తున్న రాష్ట్ర స్థాయి బుర్ర నర్సమ్మ–లింగారెడ్డి స్మారక 'తెలంగాణ తెలుగు తేజం' పేరుతో ఇచ్చే సాహిత్య పురస్కారం–2026కు ప్రముఖ కవి, జాతీయ సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ ఎంపికయ్యారు. ఈ మేరకు పురస్కార కమిటీ ఛైర్మన్, అవార్డు వ్యవస్థాపకుడు కెప్టెన్ డా.బుర్ర మధుసూదన్‌రెడ్డి, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి శుక్రవారం ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు. ఈ పురస్కార ప్రదానోత్సవం ఈ నెల 22న కరీంనగర్ పట్టణంలో నిర్వహించనున్నట్లు వివరించారు. తెలుగు భాషకు తెలంగాణ మట్టి బిడ్డలు చేసిన అమూల్య సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

### జూన్ నాటికి
## ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్ పూర్తి



**తొలి సమయం హైదరాబాద్** : హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల వాహనదారులకు ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ పనులను వేగవంతం చేసి, 2027 జూన్ నాటికి ఫ్లైఓవర్‌ను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఉప్పల్--నారపల్లి మార్గంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు వరంగల్ వైపు వెళ్లే వాహనాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ఈ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే ప్రాజెక్టు పనులు

మిగతా 2లో..

## మోడీ 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానం

- 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి
- అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడి



**తొలి సమయం హైదరాబాద్** : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

మిగతా 2లో..

## పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**అఖిలపక్ష ఐక్యవేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్**



**తొలి సమయం, వనపర్తి, సెప్టెంబరు 12**
వినాయక మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలి. అత్యవసర సేవలకు దారి వదలాలి అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ .వినాయక చవితి, దేవీ నవరాత్రుల సందర్భంగా జిల్లా ప్రజలకు, మీడియా, పత్రికా మిత్రులకు అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగలను సంతో షంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. మండపాల వద్ద యువత జాగ్రత్తలు పాటించాలని, విద్యుత్ వైర్ల సమీపంలో అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు.వినాయక మండపాలను రోడ్డుకు ఒకవైపు ఏర్పాటు చేసి, అంబులెన్స్ తదితర అత్యవసర వాహనాలు వెళ్లేందుకు దారి వదలాలని సతీష్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. సీనియర్ సిటిజన్లు, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు, రోగులకు ఇబ్బంది కలగ్కుండా డీజే, సౌండ్ బాక్సుల ధ్వని ఉండేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. యువతకు మున్సిపల్ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది, పోలీసు అధికారులు తగిన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## 5వ వార్డు ప్రజల దాహార్తి తీర్చిన కౌన్సిలర్ విజయభారతి.



**తొలి సమయం, ఇల్లందు ; సెప్టెంబర్ 12:**
ఇల్లందు, మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో గత ఐదు రోజులుగా మిషన్ భగీరథ పంపు మరమ్మతుల కారణంగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్పందించిన 5వ వార్డు కౌన్సిలర్ చిల్ల విజయభారతి వెంటనే ట్యాంకర్లను ఏర్పాటు చేయించి, వాటి ద్వారా ఇంటింటికీ నీటిని సరఫరా చేయించారు. నీటి సరఫరా పునరుద్ధరించే వరకు ప్రజలకు ఇబ్బం దులు కలగకుండా అవసరమైన సహాయాన్ని అందిస్తామని కౌన్సిలర్ విజయభారతి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని పేర్కొన్నారు.

## టిఎస్ఎటిఎఫ్ భద్రాద్రి జిల్లా నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్షుడిగా కారం రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా ఊకె కృష్ణ.**




**తొలి సమయం, ఇల్లందు;సెప్టెంబర్ , 12:**
తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ (TS ATF) భద్రాద్రి జిల్లా నూతన కమిటీని ఇల్లందులో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కారం రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా ఊకె కృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా కంగాల వెంకయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కబ్బాకుల రవి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలకు ఉపాధ్యాయ, ఉద్యోగ నియామకాల్లో 100 శాతం రిజర్వేషన్ల అమలుకు జీవో నంబర్ 3 సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కా ఓరానికి సంఘం కృషి చేస్తుందని తెలిపారు.రాష్ట్ర ప్రచార కార్యదర్శి కుర్సం అంజయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించి కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా పాయం విజయ్‌బాబు, కోరం శంతారావు, కోశాధికారిగా పూనెం బాలరాజు, కార్యదర్శులుగా ముడిగ వెంకటేశ్వర్లు, పూనెం కమలాకర్, పెండకట్ల నాగేశ్వరరావు తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రత కోసం సొంత ఖర్చులతో పరిశుభ్రత కార్యక్రమం.

**కోతులు, పాముల బెడద నివారణకు కో ఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి చర్యలు.**




**తొలి సమయం, ఇల్లందు;సెప్టెంబర్, ఝ12:**
ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో కోతులు, పాముల బెడదతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి సొంత ఖర్చులతో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. వార్డులో పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చే చర్యలు చేపట్టారు. ప్రజల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తూ ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సాంబమూర్తి తెలిపారు. కోతులు, పాముల బెడద తగ్గించేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అవసరమని పేర్కొన్నారు. సొంత ఖర్చులతో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టడంపై స్థానికులు సాంబమూర్తిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మడుగు వెంకటలక్ష్మి, వార్డు అధ్యక్షుడు రాజు, రాంబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# అప్రకటిత విద్యుత్ కోతలపై రైతుల ధర్నా

**తొలి సమయం, వనపర్తి, సెప్టెంబర్ 12**
అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ వనపర్తి మండలం నాచహల్లి క్రిష్ణగిరి, పెద్దగూడెం తండా, సవాయిగూడెం గ్రామాలకు చెందిన రైతులు శనివారం సబ్‌స్టేషన్ సమీపంలో ఆందోళనకు దిగారు. వనపర్తి--పెబ్బేరు ప్రధాన రహదారిపై బైఠాయించి విద్యుత్ శాఖకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇస్తూ రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే డీఈతో మాట్లాడించాలని రైతులు పట్టుబట్టారు. దీంతో ఏఈ ఫోన్ ద్వారా డీఈతో రైతులకు మాట్లాడించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో రైతులకు 13 గంటల పాటు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము కూడా టీవీల్లో ప్రభుత్వ ప్రకటనలను చూస్తు





న్నామని, ప్రజలకు ఏమీ తెలియదన్నట్లుగా అధికారులు ఇష్టానుసారంగా అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తు న్నారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఏఈతో కలిసి లాగ్‌బుక్‌ను పరిశీలి ంచగా.. వాస్తవంగా సరఫరా చేసిన సమయం కంటే ఎక్కువ సమయం విద్యుత్ ఇచ్చినట్లుగా నమోదు చేసు న్నారని రైతులు ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో 24 గంటల విద్యుత్ సరఫరా చేశారని, ఇప్పుడు పరిస్థితి దారుణంగా మారిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. "కేసీఆర్ ప్రభుత్వం పోయినప్పుడే కరెంటు కూడా పోయిందా?" అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేసినందుకు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.పంటలు ఎండి పోకుండా అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించి రైతులను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో, లిరైతులతో పాటు మండల పార్టీ అధ్యక్షులు కే మాణిక్యం, సింగల్ విండో అధ్యక్షులు రఘువరన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ధర్మనాయక్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ దేగ మహేష్ రెడ్డి, నాయకులు రవి ప్రకాష్ రెడ్డి, నారాయణ నాయక్, శంకర్ నాయక్, టికె నాయక్, సర్పంచ్ పద్మ వెంకటయ్య,మాజీ సర్పంచ్ బాలకృష్ణ, మహేష్, అంజి, రూప్ల నాయక్, గోవిందు నాయక్,శివ,ఆనంద్, తులసి రామకృష్ణ, శ్రీను, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ ప్రభుత్వం తెలంగాణ నీట్ విద్యార్థులకు అండగా ఉండాలి

**జీవో 150 ను సవరించాలి అన్న నగేష్ సూర్యవంశ**

**తొలి సమయం, వనపర్తి, సెప్టెంబరు 12**
ఇతర రాష్ట్రాల విద్యార్థులకు మెడికల్ సీట్లను దోచిపెట్టే జీవో 150 ను సవరించాలి.తెలంగాణ లో స్థానికతను పక్కాగా అమలు చేయాలి.బి.సి చైతన్య వేదిక విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నగేష్ సూర్యవంశం డిమాండ్. హైదరాబాద్ లో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ నీట్ తల్లితండ్రుల సంఘం ఆధ్వర్యంలో యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో బి.సి చైతన్య వేదిక విద్యార్థి విభాగం నగేష్ సూర్యవంశం పాల్గొని మాట్లాడుతూ.. ప్రస్తుతం అమల్లో ఉన్న స్థానిక అభ్యర్థి నిబంధన ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని విద్యాసంస్థలలో నీట్ క్వాలిఫైయింగ్ ఎగ్జామినేషన్ కు ముందు నాలుగు వరుస విద్యా సంవత్సరాలు చదివిన విద్యార్థికి వర్తించే స్థానిక అభ్యర్థి హోదా వలన ఇతర రాష్ట్రాల విద్యార్థులకు వరంగా మారి.. మన తెలంగాణ విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ దేశవ్యాప్తంగా సంచలనం అయినప్పుడు సిజెపి, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు ర్యాలీ చేశాయని.. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ పిలుపుతో తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్యకర్తలు అందరూ కలిసి ర్యాలీ చేశారని గుర్తు చేశారు.. తెలంగాణలోని నీట్ విద్యార్థుల తల్లిదండ్రులు



కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలను కలిసి తమ సమస్యను విన్నవించుకుందామంటే ఎవరు స్పందించకపోవడం విచారకరమన్నారు. మా తెలంగాణ విద్యార్థులకు ఇంత అన్యాయం జరుగుతున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎక్కడ పోయారని ప్రశ్నించారు, తెలంగాణ నీట్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అన్ని పార్టీలు తెలంగాణలో ఉన్న మెడికల్ సీట్లు తెలంగాణ వారికే అనే నినాదంతో కలిసి రావాలని కోరారు.. ఇప్పటికైనా ఈ రేవంత్ ప్రభుత్వం స్పందించి తెలంగాణ మెడికల్ సీట్లు ఇతర రాష్ట్రాల విద్యార్థులకు కేటాయించకుండా తెలంగాణ నీట్ విద్యార్థులకు అండగా ఉంటూ.. ఇతర రాష్ట్రాల విద్యార్థులకు మెడికల్ సీట్లను దోచిపెట్టే జీవో 150 ను సవరించాలన్నారు. తెలంగాణలో పుట్టి, ఇక్కడే విద్యాభ్యాసం చేసినటువంటి విద్యార్థులకు న్యాయం చేసి ఎంబీబీఎస్, బీడీఎస్ లలో పూర్తిస్థాయి 85శాతం అడ్మిషన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నీట్ విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు



# ఎఐకెఎమ్ఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

**తొలి సమయం, కొమరారం; సప్టెంబర్, 12:**
ఖమ్మంలో సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న అఖిలభారత రైతుకూలీ సంఘం (ఎ.ఐ. కె. ఎమ్. ఎస్.) జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏ .ఐ. కె .ఎమ్. ఎస్. ఇల్లందు మండల కార్యదర్శి మూడు మాలు, బోయితండా మాజీ సర్పంచ్ సంతు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇల్లందు మండ లం కొమరారం పంచాయతీ పరిధిలోని చింతలగుంపు, బడితండాల్లో రైతులు, కూలీలతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా రైతు రుణాలను మాఫీ చేయాలని, కిసాన్ సమ్మాన్ సహాయాన్ని పెంచాలని, ఎరువులను ఉచితంగా అందించాలని కోరారు. యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్పొరేట్ సంస్థల కు వ్యవసాయ భూములను తక్కువ ధరలకు కేటాయిం చడాన్ని వ్యతిరేకించారు. సెప్టెంబర్ 28న ఖమ్మంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభతో పాటు మూడు రోజులపాటు జరిగే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభలకు 18 రాష్ట్రాల నుంచి రైతుకూలీ సంఘాల నాయకులు



హాజరుకానున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో పి. వై .ఎల్. రాష్ట్ర నాయకులు మోతిలాల్, జోగా కృష్ణ, గుగులోత్ దేవా, పి. ఓ .డబ్ల్యు. నాయకురాలు గుగులోత్ లక్ష్మి, కేలోత్ కమిలి, సపావత్ కౌసల్య, రైతు నాయకులు గుగులోత్ రాంచంద్, మూడు లింగ, మూడు రాములు, ఆఖ్య, హచ్చ, భద్రు, బుల్లి, బింజీ, అవుదొడ్డి వెంకన్న, మంచ రామనాధం, యాదగిరి, శ్రీను, మూడీగా రవి, సుమన్, పూనెం రమాదేవి, పూనెం నర్సయ్య, పూనెం నాగన్న తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ విద్యా పర్యటనకు ఎంపికైన బండారు నరేందర్‌కు అభినందనలు

**తొలి సమయం : కేసముద్రం/ (మహబూబాబాద్ ),సెప్టెంబర్ 12:**



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కల్వల ప్రధానోపాధ్యాయులు బండారు నరేందర్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విదేశీ విద్యా విధానాలు, విద్యా విలువలు మరియు ఉత్తమ విద్యా పద్ధతుల పరిశీలన కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా నుండి ఎంపిక కావడం పట్ల మండల విద్యాధికారి కాలేరు యాదగిరి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి కాలేరు యాదగిరి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి, పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న బండారు నరేందర్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అంతర్జాతీయ విద్యా పరిశోధనా కార్యక్రమానికి ఎంపిక కావడం మహబూబాబాద్ జిల్లాకు, కల్వల పాఠశాలకు గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా ఫిన్లాండ్, జపాన్, సింగపూర్, వియత్నాం మరియు చైనా దేశాల్లో అమలవుతున్న ఆధునిక విద్యా విధానాలు, విద్యార్థుల అభ్యసన నైపుణ్యాల అభివృద్ధి, పాఠశాల నిర్వహణలో అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను పరిశీలించి, వాటిలో ఉపయోగకరమైన అంశాలను మన విద్యా వ్యవస్థలో అమలు చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా బండారు నరేందర్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన విదేశీ విద్యా పరిశీలన విజయవంతంగా సాగాలని, ఈ అనుభవం ద్వారా మరిన్ని ఉత్తమ విద్యా పద్ధతులు పాఠశాలలకు అందుబాటులోకి రావాలని మండల విద్యాధికారి కాలేరు యాదగిరి ఆకాంక్షించారు.

## కిశోర బాలికల సంఘాలకు అవగాహన కార్యక్రమం



**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్),సెప్టెంబర్ 12:**

మండలంలోని అర్పనపల్లి గ్రామంలో కిశోర బాలికల సంఘాల సభ్యులకు డ్వాక్రా మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలికలకు ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారం, చదువు ప్రాధాన్యత, బాల్య వివాహాల నివారణ, ఆత్మరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సంఘాల ద్వారా ఐక్యంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాలని, ఉన్నత చదువులపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఓఎ లు గంధసిరి లావణ్య మోడెం హరిణి అంగన్వాడీ ముత్యాల రేణుక కెంచ సౌందర్య కిశోర బాలికలు, మహిళా సంఘ సభ్యులు వెంకటమ్మ, నవీన, సృజన, యాకాంత పాల్గొన్నారు.

## తండాల్లో నేటి సమస్యపై హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం

**తొలి సమయం; కేసముద్రం/ (మహబూబాబాద్), సెప్టెంబర్ 12:**



నారాయణపురం గ్రామంలోని తులస్య తండా, చెరుకొమ్ము తండా మరియు జారుడుబండ తండా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను భారత జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ దృష్టికి బీజేపి గ్రామ పార్టీ అధ్యక్షులు భూక్యా సురేందర్ తీసుకెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా ఆయా తండాల ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరు చేయిస్తామని హుస్సేన్ నాయక్ సభ్యులు హామీ ఇవ్వడం జరిగిందనీ తెలిపారు. మూడు తండాల ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఇచ్చిన ఈ హామీపై ప్రజలు హర్షం వ్యక్తం వ్యక్తం చేశారు.

## అధికారంలో ఉంటే సెక్రెటేరియట్‌కు రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారు



బీఆర్ఎస్ నాయకులు అధికారంలో ఉంటే సచివాలయానికి రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారని మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. అసెంబ్లీ లాబీలో శనివారం చిట్‌చాట్ సందర్భంగా సీతక్క బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. ఎర్రవల్లిలో ఎల్పీ మీటింగ్ నిర్వహించి, పార్టీ ఆఫీస్‌లో మాక్ అసెంబ్లీని ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. ఫాంహౌస్ ముందు దలిత సంఘాలు నిరసన తెలిపితే పసుపు నీళ్లతో శు ద్ధి చేశారని, ఇంకా ఆ మైల పోలేదనే ఆధిపత్య దురహంకారంతో ఫాంహౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించలేదా? అని ప్రశ్నించారు. అసెంబ్లీకి రాని కేసీఆర్, మాక్ అసెంబ్లీకి కూడా రాలేదంటే ఆయనకు చట్టసభల పట్ల, సొంత పార్టీ కార్యక్రమం పట్ల ఎంత గౌరవం ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఫాంహౌస్‌ను సచివాలయంగా, పార్టీ కార్యాలయాన్ని అసెంబ్లీగా భావించే పార్టీ బీఆర్ఎస్ మినహా దేశంలో మరొకటి లేదని ఎద్దేవా చేశారు. ఫాంహౌస్‌లో ఎల్పీ మీటింగ్, పార్టీ ఆఫీస్‌లో అసెంబ్లీ మీటింగ్ అంటే ఉన్న దగ్గరకే అన్ని రావాలనుకోవడం దొరల అహంకారాని నిదర్శనమన్నారు. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు.. అధికారం పోయినా అహంకారం ఇంకా పోలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. స్పీకర్‌ను, చట్టసభలను అవమానిస్తున్న బీఆర్ఎస్‌ను ప్రజలు శిక్షించడం ఖాయమని జోస్యం చెప్పారు.

## రైల్వే వర్క్‌షాప్‌లను తనిఖీ చేసిన జీఎం

సికింద్రాబాద్ : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ శనివారం లాలాగూడ ఇంజనీరింగ్ వర్క్‌షాప్, మెట్టుగూడ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ (ఎస్అండ్‌టీ) వర్క్‌షాప్‌లను సందర్శించి అక్కడి కార్యకలాపాలను సమీక్షించారు. వివిధ విభాగాల్లో జరుగుతున్న పనులు, ఉత్పత్తి ప్రక్రియ, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. లాలాగూడ వర్క్‌షాప్‌లో వెల్డింగ్, ఫ్యాబ్రికేషన్ విభాగాలను పరిశీలించిన జీఎం పనుల నాణ్యతను సమీక్షించారు. గ్లూడ్ జాయింట్ల తయారీ విధానం, పుల్‌అవుట్ పరీక్ష ప్రక్రియను పరిశీలించి, ఉత్పత్తుల నాణ్యత, పనితీరును నిర్ధారించడంలో పరీక్షల ప్రాధాన్యాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వర్క్‌షాప్‌లో పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం మెట్టుగూడ ఎస్అండ్‌టీ వర్క్‌షాప్‌లోని పాయింట్ మెషీన్, ఎలక్ట్రికల్ విభాగాలను తనిఖీ చేశారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ పనుల వేగం, ఖచ్చితత్వాన్ని మెరుగుపరిచేందుకు ఏర్పాటు చేసిన నూతన సిఎన్‌సి బెండింగ్ మెషీన్‌ను ప్రారంభించారు. వర్క్‌షాప్‌ల సామర్థ్యాన్ని పెంచేందుకు సాంకేతిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. తదుపరి కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమైన జీఎం ఉద్యోగుల సంక్షేమం, సిబ్బంది సమస్యలు, వారి భాగస్వామ్యంపై చర్చించారు. అనంతరం వర్క్‌షాప్ ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ డి. ఆంజనేయులు రెడ్డి, ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ పి.వి. మురళీకృష్ణ, చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ వి.ఎన్.ఎం. రావు తదితరులు ఉన్నారు.

# గణేష్ ఉత్సవాలకు భారీ బందోబస్తు.. 5,742 మంది పోలీసులతో పహారా !

గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేందుకు మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ పరిధిలో అధికారులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. బందోబస్తు వివరాలను పోలీసు కమిషనర్ సుమతి శనివారం నేరేడ్‌మెట్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో వివరించారు. 5742 సిబ్బందితో భారీ బందోబస్తును నిర్వహిస్తున్నట్లు సీపీ తెలిపారు. అదే విధంగా వినాయక మండపాలు, ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా ఉండేందుకు 1200 మంది ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఏఐ టెక్నాలజీ ద్వారా ఊరేగింపులు, వినాయక మండ పాల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని చెప్పారు. ప్రత్యేక కమాండ్ కంట్రోల్ ద్వారా 24/7 నిఘాను పెడతామన్నారు. 5 వేల సీసీ కెమెరాల ద్వారా భద్రతను వీక్షిస్తామన్నారు.

వినాయక మండపాల వద్ద 2200 సహచరి వాలంటీర్లతో కలిసి ప్రజలకు సైబర్ నేరాలు, డ్రగ్స్ ఫ్రీ సిటీ, మహిళల హక్కులు, వారి భద్రత అంశాలపై అవగాహన కల్పిస్తామని అన్నారు. ప్రతి మండపం నిర్వాహకులు **https://policeportal.t spolice. gov.in/ index.htm** లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిర్వాహకులు భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూ



లైన్లు, బ్యారికేడ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సరైన పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ పరిధిలో దాదాపు 15 వేల వినాయక విగ్రహాలు ఏర్పాటవుతాయని పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటికే 6500 మంది నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు సీపీ సుమతి తెలిపారు. 27 ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వీటిలో దాదాపు 25 వేల గణేష్ విగ్రహాలు నిమజ్జనానికి తరలివస్తాయన్నారు. మరికొన్ని ఈ కమిషనరేట్ నుంచి హుస్సేన్ సాగర్‌కు వెళ్తాయన్నారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ అధికారులతో కలిసి ఉత్సవాలు జరిగే 11 రోజులతో పాటు నిమజ్జన సమయాల్లో పటిష్ట బందోబస్తు ప్రణాళికను రూపొందించుకున్నామని సీపీ అన్నారు. ప్రజలు, భక్తులు పోలీసులకు సహకరించి పండుగను ఆనందంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీపీ సుమతి కోరారు. ఎలాంటి అనుమానాస్పద వస్తు వులు, వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్వాహ కులు వీటి ఏర్పాట్ల పై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పోలీసు ఉన్నతాధికారులు, పాల్గొన్నారు.

# సభలో ప్రతిపక్షం లేకుండా అన్నీ అబద్ధాలే..

శాసనసభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పినవన్నీ అబద్ధాలు, అర్ధసత్యాలని, ఆయన ప్రజలకు క్షమాపణలు చెప్తారని ఆశించామని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీలో తమను కావాలనే సస్పెండ్ చేసి, ప్రతిపక్షం లేని సమయంలో పచ్చి అబద్ధాలు మాట్లాడారని ఆయన ఆరోపించారు. తాము అడిగిన ఏ ఒక్క ప్రశ్నకు కూడా మంత్రి సభలో సరైన సమాధానం ఇవ్వలేకపోయారని, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ప్రజలు తమ ఆస్తులను అమ్ముకునే అవకాశం కూడా లేకుండా పోయిందని మండిపడ్డారు.

22ఏ లో అసలు ఎన్ని ఎకరాల భూములను పెట్టారు. వాటిలో ఎన్ని ఎకరాలను తొలగించారనే దానిపై ప్రభుత్వం వద్ద స్పష్టత లేదని హరీశ్‌రావు విమర్శించారు. 22ఏ జాబితాలో పొరపాటుగా రైతుల భూములను చేర్చామని మంత్రి పొంగులేటి సభలో ఒప్పుకున్నప్పటికీ, బాధితులకు క్షమాపణలు చెప్పకుండా తప్పించుకున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందన్నారు కాబట్టి, దానిని జాబితా నుంచి ఎప్పుడు తొలగిస్తారో చెప్పాలని నిలదీశారు. అలాగే సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి భూముల వ్యవహారంపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



తనపై బురద జల్లడం ద్వారా సొంత తప్పులను కప్పిపుచ్చుకోవాలని చూస్తున్నారని, మంత్రి కొడుకు కంపెనీపై ఎఫ్ఐఆర్ నమోదైతే రాత్రికి రాత్రే సంబంధిత సీఐని మార్చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. తన మామగారి భూముల గురించి మాట్లాడుతూ, ఆ భూములు గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్నాయని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే ఎక్స్-సర్వీస్‌మెన్ నుంచి వాటిని చట్టబద్ధంగా కొనుగోలు చేశారని వివరణ ఇచ్చారు. ఆ భూములు గతంలోనే నిషేధిత జాబితాలో ఉంటే తమ పాలనలో రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయో సమాధానం చెప్పాలన్నారు.


నాదర్‌గుల్, వట్టినాగులపల్లి, ఖాజాగూడ, అబ్దుల్లాపూర్‌మెట్ భూముల అంశాలపై అసెంబ్లీలో మాట్లాడకుండా మంత్రి దాటవేశారని హరీశ్‌రావు విమర్శించారు. నిషేధిత భూముల సమస్యపై సభలో స్పష్టత వస్తుందని భావిస్తే అబద్ధాల ప్రవాహం పారించారని ఆవేదన వ్యక్తం చేశారు. సభలో తాము ఉంటే ప్రభుత్వం చేసిన అవినీతి, కుంభకోణాలు బయటపడతాయనే భయంతోనే తమను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని ఆయన ధ్వజమెత్తారు.

పొంగులేటి శ్రీనివాస్ ప్రజలకు క్షమాపణ చెప్తారని ఆశించామని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీలో పొంగులేటి చెప్పినవన్నీ అబద్ధాలు, అర్ధసత్యాలని ఆయన ఆరోపించారు. ప్రజలు తమ ఆస్తులు అమ్ముకునే అవకాశం లేకుండా చేశారని, ఇప్పటివరకు 22ఏ నుంచి ఎన్ని భూములు తొలగించారో చెప్పలేదని విమర్శించారు.

# రేవంత్‌రెడ్డి బ్లాక్ మెయిలర్ల సంఘం అధ్యక్షుడు: కవిత

సీఎం రేవంత్‌రెడ్డి అవినీతి సామ్రాట్.. బ్లాక్ మెయిలర్ల సంఘం అధ్యక్షుడని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆర్టీఐ చట్టాన్ని దుర్వినియోగం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించిన చరిత్రను ప్రజలు మర్చిపోరని శనివారం ఆమె వీడియో సందేశాన్ని రిలీజ్ చేశారు. సీఎం కుటుంబ సభ్యులు, మిత్రమండలి, అవినీతిలో రాటుదేలిన మంత్రులతో కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటు న్నారని విమర్శించారు. అలాంటి వ్యక్తి అసెంబ్లీలో తనకు కమీషన్లు ఎందుకంటూ కమల్ హాసన్ లెవల్‌లో ఏకపాత్రాభినయం చేస్తుంటే రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు.

గుంపు మేస్త్రీ -గుంటనక్క కుమ్మక్కయారని కవిత ఆరోపించారు. సిద్దిపేటలో నిషేధిత జాబితాలో ఉన్న వంద ఎకరాల భూమిని హరీశ్‌రావు తన తండ్రి, కుటుంబ సభ్యుల పేరు మీదకు బదలాయించారని.. దానిపై చర్యలు తీసుకునే దమ్ము ఈ ముఖ్యమంత్రికి ఉందా అని సవాల్ విసిరారు. అటు ప్రజా సమస్యలను



చర్చించాల్సిన అసెంబ్లీని అధికార, ప్రతిపక్షాల గొడవల కు వేదిక చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ అధికారంలోకి రాకముందు ఆర్టీఐ చట్టాన్ని ఉప యోగించుకొని రియల్టర్లను బెదిరిస్తే.. ఇప్పుడు అధికారంలో ఉండి కుటుంబసభ్యులు, మంత్రి మండలి మిత్రులతో కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారన్నారు. అవినీతిలో రాటుదేలిన మంత్రులతో కలిసి ఇప్పుడు రాచమార్గంలో అవినీతి సామ్రాజ్యం నిర్మిస్తున్నారన్నారు. అసెంబ్లీలో తనకు కమీషన్ల అవసరమేంటని రేవంత్‌రెడ్డి మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు.

22ఏను పొంగులేటికి, ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, ఇసుకను సీతక్కకు రాసిచ్చి వారి ద్వారా కమీషన్లు పొందుతున్న వ్యక్తి రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. మూసీ నుంచి ఇసుక వరకు ప్రతి దాంట్లో అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. అధికారంలో ఉన్న పదేళ్లు బీఆర్ఎస్ నాయకులు.. కాంగ్రెస్ కన్నా ఎక్కువగా దోచుకున్నారని అన్నారు. ఆ పార్టీ నాయకులకు ప్రజల కోసం పోరాటం చేయాలన్న సోయి లేకుండా పోయిందని విమర్శించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలను సస్పెండ్ చేస్తే... కౌన్సిల్‌లో ఎందుకు మాట్లాలేదని ప్రశ్నించారు. సీఎం అవినీతి పాపాల చిట్టాను కొడంగల్ వేదికగా బయటపెడతామని తెలిపారు. ఈ నెల 20న కొడంగల్‌లో పాంచజన్య సంకల్ప సభ నిర్వహిస్తున్నామన్నారు. అదే రోజు కొడంగల్ వేదికగానే ముఖ్యమంత్రి అవినీతిని ప్రజలు ముందు పెడతామని చెప్పారు.

# కేసీఆర్ నా మాట వినలేదు.. రేవంత్ అయినా వినాలి..



కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు అస్సలు విలువ ఉందో లేదో అర్థం కావడం లేదని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేలు సూచనలు చేసినా, ప్రజ సమస్యలను అధికారు దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని హాట్ కామెంట్స్ చేశారు. శాసనసభలో ఇవాళ 'కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు'పై జరిగిన చర్చలో రాజాసింగ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా హైదరాబాద్ అభివృద్ధి, స్థానిక సమస్యలపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టడం చాలా మంచి పరిణామమని రాజాసింగ్ కొనియాడారు. నగర అభివృద్ధి కోసం ప్రభుత్వం వేలాది కోట్ల నిధులు మంజూరు చేస్తోందని, అయితే ఆ మంజూరైన నిధులను క్షేత్రస్థాయిలో ఎలా వి ని యో గి ం చు కో వా లో నిర్ణయించేలా స్థానిక ఎమ్మెల్యేలకు భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారాలంటే ముందు గల్లీలు బాగుపడాలని ఆయన స్పష్టం చేశారు. నగర పరిధిలో ఎదురవుతున్న తీవ్రమైన మంచినీరు, డ్రైనేజీ సమస్యలపై సభ దృష్టికి తీసుకువస్తూ నగరంలో ప్రతిసారీ మంచి నీటిని వదిలే సమయంలో.. మొదటి 30 నిమిషాలు మురికి నీరే వస్తోందని, ఈ డ్రైనేజీ-వాటర్ పైప్‌లైన్ల వ్యవస్థను తక్షణమే మెరుగుపరచాలన్నారు. కొన్ని బస్తీలలో అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున 3, 4 గంటల సమయంలో మంచి నీళ్లు వదులుతుండటంతో నీళ్లు పట్టుకోవడానికి ప్రజలు నిద్రలేచి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరం నడిబొడ్డున హైరైజ్ భవనాలకు అనుమతులు ఇచ్చేముందు అక్కడ తగినంత డ్రైనేజీ, రోడ్లు, నీటి వసతి ఉందో లేదో పరిశీలించకుండానే అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు.


కేసీఆర్ మాట వినలేదు.. రేవంత్ అయినా సమావేశం పెట్టాలి! గతంలో బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్‌కు కూడా హైదరాబాద్ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేయాలనే కల ఉండేదని గుర్తుచేసిన రాజాసింగ్.. హైదరాబాద్ ఎమ్మెల్యేలందరితో కలిసి కో-ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేయాలని తాను సలహా ఇచ్చానని తెలిపారు. అయితే దురదృష్టవశాత్తూ కేసీఆర్ తన మాట వినలేదని, సమావేశం ఏర్పాటు చేయలేకపోయారని చెప్పారు. ఇప్పుడైనా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిటీ అభివృద్ధికి సంబంధించి ఎమ్మెల్యేల బాధ్యతను గుర్తించి, హైదరాబాద్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు.



## ట్రైలర్ లేదు.. నేరుగా థియేటర్లోనే సాలిడ్ హైప్ ఇస్తాం..!

భారీ అంచనాలతో తెరకెక్కిన యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' (ఙ్ష్రవ్రాఖుతీఖుఽఅంవ) సినిమా ట్రైలర్ లేకుండానే విడుదలవ్వనుంది. గత కొన్ని రోజులుగా మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ వార్తను హీరో, నేచురల్ స్టార్ నాని ధ్రువీకరించారు. శుక్రవారం మీడియాతో చిట్‌చాట్‌లో ట్రైలర్ లేకుండానే వస్తున్నామని, నేరుగా థియేటర్‌లోనే ప్రేక్షకులకు, అభిమానులకు సాలిడ్ హైప్ ఇచ్చి ఇంటికి పంపిస్తామని నాని తెలిపారు. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబోలో వస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలున్నాయి. ఇప్పటికే 'ఆయా షేర్', 'యేష నాగుల కట్ట' పాటలు నెట్టింట వైరలవుతుండగా.. మునుపెన్నడూ లేనివిధంగా జడల గెటప్‌లో నాని పూనకాలు తెప్పించడం ఖాయమనిస్తోంది. అందుకని.. సినిమాలోని సస్పెన్స్‌ను మెయింటైన్ చేయడంతో పాటు ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచడానికి ట్రైలర్ లేకుండానే సినిమాను నేరుగా థియేటర్లలోకి తీసుకురావాలని చిత్రబృందం నిర్ణయించింది. ఈ విషయాన్ని హీరో నాని అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం మీడియాతో చిట్‌చాట్‌లో దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో కలిసి మాట్లాడిన నాని సినిమాలో తన జడల లుక్, వెయ్యి మందితో ఫైట్ వార్తలపై స్పష్టత నిచ్చారు. ఆన్‌లైన్‌లో, మీడియాలో ప్రచారం అవుతున్నట్టు.. నీళ్ల అడుగున ఫైట్ లేదని.. 1000 మందితో కూడా ఫైట్ సీన్ లేదని నేచురల్ స్టార్ వెల్లడించారు. అంతేకాదు.. 'సినిమాలో మీ జడల బరువు 6 కేజీలు ఉందా?' అనే ప్రశ్నకు నవ్విన నాని.. 'అంత బరువు లేదండి' అని చెప్పారు. ఈ చిత్రంలో ఒక్క ఫ్రేమ్ కూడా బోర్ కొట్టించదని పేర్కొన్న ఆయన.. సినిమా ఇంత బాగా రావడానికి యూనిట్‌లోని ప్రతిఒక్కరూ చెమటోడ్చారని తెలిపారు. స్క్రీన్ మీద ప్రతి సీన్‌లో టెక్నీషియన్ల కష్టం కనిపిస్తుందని ఆయన అన్నారు. షూటింగ్‌లో తనతో పాటు క్యారెక్టర్ ఆర్టిస్టులు కూడా గాయపడ్డారని, కానీ.. తన గాయాల గురించే మీడియాలో వార్తలు వచ్చాయని స్పష్టం చేశారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదలవ్వనుంది.

## తెలుగులోకి 'హనుమాన్ అంశ్'.. సెప్టెంబర్ 18న గ్రాండ్ రిలీజ్!



ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవితాధారంగా తెరకెక్కిన సంచలన హిందీ భక్తిరస చిత్రం 'హనుమాన్ అంశ్' ఇప్పుడు అధికారికంగా తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఎలాంటి భారీ అంచనాలు లేకుండా కేవలం రూ.2 కోట్ల చిన్న బడ్జెట్‌తో విడుదలై, బాక్సాఫీస్ వద్ద వంద కోట్ల రూపాయలకు పైగా వసూళ్లతో అఖండ విజయాన్ని సొంతం చేసుకున్న ఈ చిత్రాన్ని తెలుగులో గ్రాండ్ రిలీజ్ చేసేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ చిత్రాన్ని తెలుగులో సమర్పిస్తుండగా, ఫార్చ్యున్ ఫోర్ సినిమాస్ సంస్థ తెలుగు థియేట్రికల్ విడుదలను చేపట్టింది. విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శోభినావ్ సత్య, విహాన్ శెడ్గే ప్రధాన పాత్రల్లో నటించారు. నీమ్ కరోలి బాబా భక్తుల భావోద్వేగాలను, ఆయన జీవితంలోని ముఖ్య ఘట్టాలను అద్భుతంగా ఆవిష్కరించిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను కూడా ఎంతగానో ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలోనే అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 18న అత్యంత భారీ స్థాయిలో తెలుగు తెరపైకి రానుంది.

## ప్రభాస్ 'ఫౌజీ' వాయిదా ..
## ఆ డేట్‌పై ఎన్ని సినిమాలు కన్నేసాయో తెలుసా?




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక పీరియాడిక్ యాక్షన్ చిత్రం 'ఫౌజీ'. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ గతంలోనే ప్రకటించారు. అయితే సినిమా షూటింగ్ ఇంకా పూర్తికాకపోవడంతో అనుకున్న తేదీకి 'ఫౌజీ' వస్తుందా? అనే చర్చ మొదలైంది. 'ఫౌజీ' చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా కొనసాగుతున్నట్లు సమాచారం. ప్రభాస్ కూడా సినిమాకు భారీగా కాల్షీట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. ఒకేసారి రెండు, మూడు చిత్రీకరణ బృందాలతో షూటింగ్ నిర్వహిస్తూ పనులను వేగంగా పూర్తి చేస్తున్నారని టాక్. సినిమాను డిసెంబర్ 3న విడుదల చేయాలనే విషయంలో చిత్రబృందం మాత్రం పూర్తి నమ్మకంతో ఉన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ నిర్మాణ పనులు, మిగిలిన చిత్రీకరణ, పోస్ట్ ప్రొడక్షన్ పనులను దృష్టిలో పెట్టుకుని విడుదల తేదీపై పరిశ్రమ వర్గాల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ 'ఫౌజీ' డిసెంబర్ మొదటి వారంలో విడుదల కాకపోతే.. ఆ ఖాళీని భర్తీ చేసేందుకు ఇప్పటికే కొన్ని సినిమాలు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వాటిలో ముందుగా చెప్పుకోవాల్సింది విశ్వక్ సేన్ నటిస్తున్న 'లెగసీ'. పొలిటికల్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాను డిసెంబర్ 4న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీంతో డిసెంబర్ మొదటి వారంలో తన స్థానాన్ని ఈ సినిమా ముందుగానే ఖరారు చేసుకుంది. మరోవైపు దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే జంటగా నటిస్తున్న 'శ్రీ శ్రీ' సినిమా కూడా డిసెంబర్ మొదటి వారంలో విడుదలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అలాగే యువ సామ్రాట్ నాగచైతన్య హీరోగా 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వృషకర్మ' డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రభాస్ లాంటి భారీ పాన్ ఇండియా స్టార్ సినిమా అదే సమయంలో విడుదలకు సిద్ధంగా ఉంటే.. విశ్వక్ సేన్, దుల్కర్ సల్మాన్, నాగచైతన్య సినిమాల నిర్మాతలు డిసెంబర్ మొదటి వారాన్ని ఎంచుకునే విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించేవారు. కాని ఆయన తప్పుకోవడంతో వీరు రేసులోకి వచ్చారు. 'ఫౌజీ' డిసెంబర్ నుంచి తప్పుకుంటే.. వచ్చే ఏడాది వేసవికి వస్తుందా అనే చర్చ కూడా ఇండస్ట్రీలో నడుస్తుంది.

## సంయుక్త మీనన్ బర్త్ డే టీజర్ విడుదల..
## వీరనారి అవతారం లుక్‌కు ఫిదా అవుతున్న ఫ్యాన్స్!



నిఖిల్ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో సంయుక్త, నభా నటేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం దాదాపు రెండేళ్లుగా షూటింగ్ జరుపుకుని ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ఈ రోజు సంయుక్త మీనన్ బర్త్ డే సందర్భంగా 40 సెకన్ల టీజర్ విడుదల చేశారు. ఇందులో వీరనారి పాత్రలో సంయుక్త కనిపించిన తీరు, కత్తి యుద్ధాలు చేసిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇప్పటివరకు గ్లామర్, ఎమోషనల్ పాత్రల్లో కనిపించిన సంయుక్త.. 'స్వయంభు'లో మాత్రం పూర్తి భిన్నమైన అవతారంలో కనిపించబోతున్నట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. 'స్వయంభు' కథ చారిత్రక నేపథ్యంలో సాగనున్నట్లు టీజర్‌ను చూస్తే అర్థమవుతోంది. రాజ్యాలు, అంతర్యుద్ధాలు, ప్రజలను కాపాడేందుకు జరిగే పోరాటాలు, వీరత్వంతో కూడిన సన్నివేశాలతో సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సంయుక్త పోషిస్తున్న పాత్రకు కూడా కథలో కీలకం కానుంది. చేతిలో కత్తి పట్టుకుని యుద్ధరంగంలో పోరాడుతున్న ఆమె సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీరనారి గెటప్‌లో సంయుక్త లుక్‌కు అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. మరో హీరోయిన్ నభా నటేశ్ కూడా ఈ సినిమాలో యువరాణి పాత్రలో కనిపించనుంది. ఆ మధ్య విడుదలైన టీజర్‌లో ఆమె లుక్ కూడా రాజసం ఉట్టిపడేలా ఉంది. చారిత్రక నేపథ్యానికి తగ్గట్టుగా రూపొందించిన సెట్స్, వస్త్రధారణ, పాత్రల లుక్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. నిఖిల్ కూడా తన కెరీర్‌లో ఇంతకు ముందు చేయని తరహా పాత్రలో కనిపించనున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. భారీ యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగాలకు కూడా సినిమాలో ప్రాధాన్యత ఉన్నట్లు కనిపిస్తోంది. కమెడియన్ సునీల్ ఈ సినిమాలో పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. ఆయన పాత్ర ఎలా ఉండబోతుందనేది ఆసక్తిని కలిగిస్తోంది. చారిత్రక నేపథ్యానికి భారీ యాక్షన్, విజువల్స్, డ్రామాను జోడించి సినిమాను రూపొందించినట్లు కనిపిస్తోంది.

## వెంకీ - త్రివిక్రమ్ మూవీ అప్‌డేట్.. రేపు 'ఆదర్శ కుటుంబం' టీజర్!




టాలీవుడ్ స్టార్ హీరో విక్టరీ వెంకటేష్, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్: 47 / ాాఖ 47) సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ సోషల్ మీడియాలో కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను రేపు మధ్యాహ్నం 12:00 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 2న గాంధీ జయంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. "నువ్వు నాకు నచ్చావ్", "మల్లీశ్వరి" వంటి క్లాసిక్ ఫ్యామిలీ హిట్స్ అందించిన త్రివిక్రమ్ మాటలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో ఈ సినిమాపై సినీ వర్గాల్లోనూ, అభిమానుల్లోనూ విపరీతమైన క్రేజ్ ఉంది.

PUBLICATIONS AND PRINTERING BY VEMULA AYODHYA RAMULU, H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506101, TELTEL NO 12283, PHONE NUMBER 9000689544...